## క్లుప్తంగా

### కేజీబీవీ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్

గూడూరు: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సర్వ శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్ గురువారం తనిఖీ చేశారు. ఇంటర్ సప్లిమెంటరీకి సన్నద్ధమయ్యే విద్యార్థినులతో మాట్లాడారు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ యశోద, జీసీడీఓ సునీత ఉన్నారు.

### సచివాలయాల తనిఖీ

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు, కల్లపరి, పులకుర్తి గ్రామ సచివాలయాలను గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్‌డీజీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని, సర్వీసుల సంఖ్యను మరింత పెంచాలని సిబ్బందిని ఎంపీడీఓ ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీలను పరిష్కరించాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### సుంకేసులకు 370 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 370 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు.

### చెరువుల మరమ్మతుకు ప్రతిపాదనలు

పాణ్యం: మండలంలోని చెరువుల నిర్వహణకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ అర్జున్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం సమీపంలోని చెరువు, కొండజూటూరు, ఆలమూరు, వడ్డుగండ్ల చెరువులకు మరమ్మతులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి పంపుతున్నామన్నారు.

### ఇంజినీరింగ్ సిబ్బందికి మెమోలు

కోడుమూరు: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు, నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్యాలకుర్తి, కల్లపరి, గోరంట్ల, ముడుమలగుర్తి గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందికి గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్ మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సంజాయిషీ తెలపాలని ఎంపీడీఓ వారిని ఆదేశించారు.

### గరిష్ట వేతనం పొందండి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ లక్ష్మన్న

సి.బెళగల్: నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేసి గరిష్ట వేతనం రూ.272 పొందాలని ఏపీఓ లక్ష్మన్న ఉపాధి కూలీలకు సూచించారు. గురువారం ఆయన సి.బెళగల్ కొండ ప్రాంతంలో జరుగుతున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించి, మేటీలకు పలు సూచనలు చేశారు. పని ప్రాంతంలో కూలీలకు నీడ,తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని టీఏలను ఆదేశించారు.

### ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు

కోడుమూరు రూరల్: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు సూచించారు. గురువారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, కరెంట్, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుతోపాటు బిల్లులు కూడా వెంటనే మంజూరు చేస్తామని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలని ఏఈ ఫారుక్‌హుసేన్, సిబ్బందికి సూచించారు.

# అభివృద్ధి మెండుగా.. సంక్షేమం నిండుగా..

నాలుగేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

- ఒక్కో మండలానికి రూ.20 కోట్లతో జీటీ రహదారులు
- రూ.10 కోట్లతో గ్రామ సచివాలయాలు
- గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేళ్లైంది. ఇంత తక్కువ కాలంలోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతుండటంతో ప్రజల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. గత టీడీపీ హయాంలో గతుకుల రోడ్లు, ఎక్కడికక్కడే ఉన్న సమస్యలు.. ప్రస్తుతం ఎక్కడా కనిపించవు. ఇక ఏ సేవ అయినా గ్రామాల్లోని లభిస్తుండటంతో అన్ని వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



పాణ్యంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని



పాణ్యంలో కొత్తగా ఏర్పడిన జగనన్న కాలనీ

పాణ్యం: 2019లో ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించారు. సచివాలయల వ్యవస్థను ప్రవేశపెట్టి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేశారు. ఒక్కో గ్రామానికి రూ.45 లక్షలతో గ్రామ సచివాలయాల భవనాలు నిర్మించారు. అందులో రైతు సేవలకు రూ.21 లక్షతో ఆర్‌బీకేలు, పేదల ఆరోగ్యానికి రూ.17 లక్షతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. వీటికి తోడు ప్రతి మండలానికి 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, పిల్లల ఆరోగ్యం కోసం బాల సురక్ష తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల ఆరోగ్యానికీ భరోసా ఇచ్చారు. గౌరవ వేతనంతో వలంటీర్లను నియమించి ప్రజల సేవలో తరించేలా చేశారు.

- గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రోడ్లు బాగులండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులును మంజూరు చేసింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కృషితో నియోజకవర్గంలో దాదాపు ప్రతి పల్లెకూ రవాణా సౌకర్యం మెరుగుపడింది. పాణ్యం మండలం మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య రూ.2 కోట్లు, కొణిదేడు–కొత్తూరు రూ.1.80 కోట్లు, తొగర్చేడు–ఉడుమల్పూరం రూ.70 లక్షలు, పాణ్యం–బనగానపల్లె రోడ్ రూ.2.35 కోట్లు, గోనవరం–బలపనూరు రూ.2.60 కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించారు. వరద ప్రవాహం వల్ల దెబ్బతిన్న పిన్నాపురం బ్రిడ్జిని రూ.85 లక్షలతో నిర్మించారు. మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వాగుపై రూ.85 లక్షలతో కల్వర్టు ఏర్పాటు చేశారు. తక్షణ మరమ్మతుల కింద భూపనపాడు గ్రామ పరిధిలోని సీసీకి రూ.20 లక్షలు, మద్దూరు పీహెచ్‌సీ నాడు–నేడు కింద రూ.67.25 లక్షల చొప్పున వెచ్చించారు.
- గడివేముల మండలం మంచాలకట్ట గ్రామ రోడ్డుకు రూ.20 లక్షలు, బుజునూరుమెట్ట– పెసరవాయి గ్రామాల మధ్య రోడ్డుకు రూ.2 కోట్లు ఖర్చు చేశారు.
- కల్లూరు మండలం కె.నాగలాపురం –బస్తీపాడు, చిన్నటేకూరు మీదుగా నన్నూర్‌కు రూ.1.65 కోట్లతో రోడ్డును నిర్మించారు. కల్లూరు అర్బన్ పరిధిలో ఈద్గా నుంచి చెన్నమ్మ సర్కిల్ వరకు రూ.70లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇక నన్నూర్ నుంచి బస్తిపాడు వయా చిన్నటేకూరు మీదుగా ఉన్న సింగిల్ రోడ్డును రూ.22.50 కోట్లతో డబుల్ రోడ్డు వేసేందుకు త్వరలో పనులు ప్రారరంభించనున్నారు.
- పాణ్యం మండలంలో మొదటి విడద నాడు నేడుకు రూ.3.94 కోట్లు ఖర్చు చేసి పాఠశాలల రూపురేఖలు మార్చారు. రెండో దశలో రూ.64 లక్షలతో పనులు జరుగుతున్నాయి.
- కల్లూరు మండలంలో రూ.18 కోట్లతో 30 పాఠశాలలను బాగు చేశారు.
- ఓర్వకల్లు మండలానికి రూ.20 కోట్లు ఖర్చు చేశారు.
- వీటితో పాటు నియోజకవర్గంలోని సోలార్, మైనింగ్, మార్కెట్‌యార్డు, ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర ప్రత్యేక నిధుల్లోని దాదాపు రూ.80 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు పూర్తిచేశారు.
- ఇక నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీటవేశారు. అమ్మఒడి ద్వారా చదువుకు, రైతు భరోసా ద్వారా రైతుభుకు. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా అవ్వ, తాతలకు, విభిన్న ప్రతిభా వంతులకు, ఒంటరి మహిళలకు అండగా నిలిచారు.
- వైఎస్సార్ యంత్ర సేవల ద్వారా రైతులకు(సీహెచ్‌సీ(గ్రూప్)లకు ప్రభుత్వం రూ.54 లక్షల రాయతీని అందించింది. రూ.17 లక్షల విలువ చేసే వరికోత మిషన్లు అందించారు.
- పాణ్యంలో అర్హులైన 1,258 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వీరిలో 800 గృహాలు నిర్మించుకుంటున్నారు. అందుకు ప్రభుత్వం రూ.14 కోట్లు వెచ్చిస్తోంది.
- తాగునీటి కోసం మండలానికి రూ.8 కోట్ల మేరా నిధులు కేటాయించి ఓహెచ్ఆర్‌లను నిర్మించి పూర్తి చేశారు.



పాణ్యంలో రూ.45 లక్షలతో నిర్మిస్తున్న అగ్రిల్యాబ్



మద్దూరు- అనుపూరు గ్రామాల మధ్య వేసిన బీటీ రోడ్డు

## ఉత్కంఠ భరితంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు గ్రామంలో నిర్వహించిన ఎద్దులు బండలాగుడు పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. గ్రామంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి తిరునాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. 7 ఎడ్ల జతులు తలపడగా ఎస్ కొత్తూరు బీరం బుల్స్(పెద్ద జత) వృషభాలు మొదటి బహుమతి(రూ.50 వేలు) కైవసం చేసుకున్నాయి. బీరం బుల్స్(చిన్న జత)వృషభాలు రెండవ బహుమతి (రూ.40 వేలు), సోమయాజుల పల్లె యాగాల నర్సయ్య వృషభాలు మూడో బహుమతి(రూ.30 వేలు, అనంతపురం జిల్లా చాగల్లు ఆదినారాయణ వృషభాలు నాల్గవ బహుమతి(రూ.20 వేలు), నంద్యాల జిల్లా ఏ కోడూరు చాగంటి నాగేశ్వరరెడ్డి వృషభాలు ఐదవ బహుమతి(రూ.10 వేలు) దక్కించుకున్నాయి. పోటీలకు వాడాల రామనాయుడు, నందికొట్కూరు అబ్దుల్ కలాం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు



బ్రాహ్మణదొడ్డి ఆర్బీకేలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు ఆర్బీకేలలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఉద్యాన శాఖ అధికారి మదన్‌మోహన్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సచివాలయాలను, ఆర్బీకేలను తనిఖీ చేసి ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే వర్షాలు కురుస్తుండటంతో ఎరువులను ప్రభుత్వం ముందుగానే సిద్ధం చేసిందని, ఎరువులు కావాల్సిన రైతులు ఆర్బీకేలను సంప్రదించాలని ఏఓ సూచించారు. వివిధ కారణాలతో మృతుచెందిన రైతుల స్థానంలో వారి కుటుంబ సభ్యులు రైతు భరోసా పథకానికి శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్బీకేలలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి, పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

## పేర్లు మార్చేదెప్పుడో?




దిన్నెదేవరపాడు సచివాలయంలో బోర్డుపై పాత అధికారుల పేర్లు దర్శనమిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ సచివాలయంలో గతంలో పని చేసి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారుల పేర్లే నేటికీ దర్శనమిస్తుండడం గమనార్హం. కార్యాలయ భవనం గోడపై సమాచార హక్కు చట్టం 2005 బోర్డుకు సంబంధించి ప్రస్తుతం సహాయ పౌరసరఫరా అధికారి, అప్పిలేట్ అధికారిగా గతంలో విధులు నిర్వహించిన వారు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ప్రస్తుతం పని చేస్తున్న వారి పేర్లను పెయింట్‌తో రాయకుండా, కేవలం పేపర్ అతికించారు. కాలక్రమేనా పేపర్ కాస్త చిరిగిపోవడంతో పాత అధికారుల పేర్లే బోర్డుపై దర్శమిస్తున్నాయి.

### అర్జీలకు తక్షణ పరిష్కారం



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమణ

కల్లూరు: మండల ప్రత్యేక అధికారి, సెట్కూరు సీఈఓ రమణ గురువారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో స్పందనతో పాటు కొనసాగుతున్న వివిధ పనుల ప్రాపార్యను శనివారం నాటికి అందించాలన్నారు. సచివాలయానికి వచ్చే స్పందన అర్జీలను, ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, వివిధ గ్రామల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

### పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్

పాణ్యం: మండలంలోని 2023–24విద్యా సంవత్సరానికి సబంధించి పాఠ్య పుస్తకాలు గురువారం మండల కేంద్రానికి చేరాయి. ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన పుస్తకాలను డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్ పరిశీలించారు. మండలానికి 57,218 పుస్తకాలు రావాల్సి ఉండగా మొదటి విడతలో 10,599 పుస్తకాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం నాడు–నేడు రెండవ విడత పనులను పరిశీలించారు. పెడింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంఈఓ కోటయ్య ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి



మురుగునీటి నిల్వను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రైవేట్ స్థలంలో మురుగు నీరు నిల్వ ఉందనే ఫిర్యాదు మేరకు గురువారం ఆయన ఈ తాండ్రపాడు గ్రామాన్ని సందర్శించారు. మురుగు కాల్వల ద్వారా వచ్చిన నీరు తగ్గులో ఉన్న ప్రైవేట్ స్థలంలో నిలిచిపోయినట్లు గుర్తించి సమస్య పరిష్కారానికి కృష చేస్తామని చెప్పారు. ఈయన వెంట పంచాయతీ కార్యదర్శి జగన్నాథం ఉన్నారు.

## రైతుల శ్రేయస్సుకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉయ్యాలవాడ సమీపంలో కొత్తగా మంజూరైన 32/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు పొరుగు కలుగొట్ల సబ్‌స్టేషన్ నుంచి ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, మీదివేముల గ్రామాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో వ్యవసాయ బోరుబావులు, గృహాలకు తీవ్ర అంతరాయం కలిగేదన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లాలో ఐదు సబ్‌స్టేషన్లు మంజూరు చేశారన్నారు. అందులో పాణ్యం నియోజకవర్గానికే రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు రావడంతో సంతోషకరమన్నారు. ఈ విషయంలో కృషి చేసిన విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో విద్యుత్ కొరత తల్తెకుండా ఉండాలనే ఉద్దేశంతో మండలంలోని శకునాల, గని గ్రామాల మధ్య సుమారు 5 వేల ఎకరాలలో మెగా సోలార్ విద్యుత్ ఉత్పాదక కేంద్రాన్ని స్థాపించామన్నారు. ప్రస్తుతం గుమ్మితం తండా వద్ద రూ.15 వేల కోట్లతో బహుళ విద్యుత్ ఉత్పాదక పరిశ్రమను నెలకొల్పుతున్నామన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనుల నాణ్యతలో రాజీపడొద్దని అధికారులకు సూచించారు. ఎస్ఈ ఉమాపతి మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే 2,150 వ్యవసాయబోర్లకు, 3,250 గృహాలకు నిరంతర విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, విద్యుత్ శాఖ ఈఈలు రమేష్, రాజేష్, డీఈలు సుబ్బన్న, రంగస్వామి, ఏఈ ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కొండారెడ్డినగర్‌లో నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని 38వ వార్డు కొండారెడ్డి నగర్‌లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటలో తెలిపాయి. ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, పథకాలపై అవగాహన కల్పిస్తారని, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

### కాచి చల్లార్చిన నీటిని తాగాలి

సి.బెళగల్: మండల ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎంపీడీఓ రాముడు గురువారం ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలు విరివిగా కురవడంతో తాగునీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. నీటిని కాచి చల్లార్చి వడబోసి తాగితే రోగాలు దరిచేరవన్నారు. నదీతీర గ్రామాల ప్రజలు తాగునీటిపై జాగ్రత్తలు వహించాలన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందరూ ఆయా గ్రామాల ప్రజలపే అప్రమత్తం చేసి ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

### గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలి

సి.బెళగల్: సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని ఈఓఆర్డీ సందీప్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల్లో పర్యటించారు. ఈర్లదిన్నె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, ఉద్యోగులు, వలంటీర్ల హాజరు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలు పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో సమావేశమై సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముడుమాల గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి పారిశధ్య కార్యక్రమాలు, చెత్త సేకరణ కేంద్ర నిర్వహణపై సచివాలయ ఉద్యోగులకు సూచనలిచ్చారు.

### ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ వెంకటరమణ

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల, ఎల్‌కే తండాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ వెంకటరమణ గురువారం పరిశీలించారు. పనుల వద్ద కూలీలకు ఏర్పాటు చేసిన సదుపాయాలను, మస్టర్లను పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని టీఏ ప్రసాద్‌కు సూచించారు.

## కబడ్డీ విజేత ప్యాపిలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ మల్లికార్జున

ఓర్వకల్లు: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీలలో ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలోని చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన పోటీలను ఎస్ఐ మల్లికార్జున ప్రారంభించారు. ప్యాపిలి జట్టు ప్రథమ స్థానం సాధించి రూ.30 వేలు దక్కించుకుంది. తిమ్మాపురం జట్టు రెండవ స్థానంలో గెలిచి రూ.20 వేలు, శకునాల జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.10 వేలు, పుల్లూరు జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ.5 వేలను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వాసుదేవరెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి పాల్గొన్నారు.

## ఎక్కువ పంటలతో నేల సారవంతం



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు: వివిధ రకాల పంటలు వేయడం వల్ల నేల సారవంతమై అధిక దిగుబడులనిస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, సీనియర్ థీమాటిక్ లీడ్ సి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపురం, పెద్దటేకూరు గ్రామాల్లో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ శౌధర్‌రెడ్డి ఉన్నారు.

### కోలుకోలేక వివాహిత మృతి

కల్లూరు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత కోలుకోలేక గురువారం మృతిచెందింది. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. చిన్నటేకూరు గ్రామానికి చెందిన శ్వేత(27) భర్త దశరథ కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. దీంతో దశరథను తల్లిదండ్రులతో పాటు భార్య శ్వేత మందలించారు. మనస్తాపనికి గురైన దశరథ బుధవారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న భార్య శ్వేత ఇంట్లోనే పురుగు మందు తాగింది. స్థానికులు ఇద్దరిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా గురువారం కోలుకోలేక శ్వేత మృతిచెందగా, దశరథ చికిత్స పొందుతున్నాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బోరు ఏర్పాటు



బోరు వేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి సంగమేశ్వరం కాలనీలో గురువారం బోరు వేయించారు. కొంతకాలంగా ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతుండటంతో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శిరుప శ్రీనివాసరెడ్డి.. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు కాలనీలో రెండు బోర్లు వేయించగా సమృద్ధిగా నీరు పడింది. త్వరలో మోటర్లు బిగించి కాలనీ వాసులకు తాగునీరు అందిస్తామని నాయకులు తెలిపారు.

### పంటకోత ప్రయోగాలు

గడివేముల: మండల పరిధిలోని గడివేముల సమీపంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటలో వ్యవసాయాధికారులు గురువారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



వరిలో పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం